
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 8 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.32,400
అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32,400, కనిష్టంగా రూ.3,980 ప్రకారం ధర పలికాయి.



30 పడకల ఆస్పత్రి
ముదిగుబ్బ వాసులకు 30 పడకల ఆస్పత్రి కలగానే మారింది. ధర్మవరం నుంచి గెలిచిన సత్యకుమార్ వైద్య,ఆరోగ్య మంత్రిగా ఉన్నా.. ఆయన హామీ నెరవేరలేదు. 10లో

గరిష్టం/కనిష్టం
38.8°/21.1°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఇదేనా మీ సంస్కారం మంత్రి గారూ..?

- అధికారులను గౌరవించడం నేర్చుకోండి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్: ''ప్రజల బాగోగులు ఎలాగూ పట్టించుకోవడం లేదు. కనీసం మీ కోసం పనిచేసే అధికారులనైనా మనుషులుగా చూడండి. ఎవరైనా నమస్కారం పెడితేనే ప్రతి నమస్కారం చేస్తాం. అలాంటిది ఒక మండల మెజిస్ట్రేట్ గౌరవంతో పూలబొకే తీసుకువస్తే విసిరిపడేస్తారా...ఇదేనా మీ ప్రభుత్వం అధికారులకు ఇచ్చే విలువ..? ఇప్పటికైనా కాస్త సంస్కారం నేర్చుకోండి'' అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మంత్రి సవితకు హితవు పలికారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆదివారం పెనుకొండలోని ఓ ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణం వద్ద రేషన్ సరుకుల పంపిణీలో పాల్గొన్న మంత్రి సవిత... పౌరసరఫరాల శాఖ అధికారి ప్రభావతి, తహసీల్దార్ శ్రీధర్‌లను తీవ్రంగా అవమానించారన్నారు. వారిద్దరూ గౌరవంతో పూలబొకేలు ఇచ్చి ఆహ్వానిస్తుంటే. కలెక్టర్ సమక్షంలోనే మంత్రి ఆ బొకేలను వెనక్కు విసరడం ఎంత వరకు న్యాయమన్నారు. అధికారులకు మంత్రి ఇచ్చే గౌరవం ఇదేనా...? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అధికారులకు విలువ తగ్గిందనే విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిన మంత్రి వీడియో చూస్తే తెలుస్తుందన్నారు. మంత్రి సవిత ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. సభ్యత, విలువలను నేర్చుకోవాలని హితవు పలికారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లాకు 9వ స్థానం

పుట్టపర్తి టౌన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,188 మంది పరీక్షలు రాయగా, 1,902 మంది (45 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,199 మంది పరీక్ష రాయగా, 1,437 మంది (65 శాతం) ఉత్తీర్ణులైనట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 9వ స్థానంలో నిలిచింది.

సెమీస్‌కు జూనియర్ మహిళల హాకీ జట్టు



సెమీ ఫైనల్‌కు చేరిన జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టుతో నిర్వాహకులు

ధర్మవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో జిల్లా మహిళల హాకీ జట్టు సెమీ ఫైనల్‌కు చేరిందని హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి సూర్యప్రకాష్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ హుసేన్ తెలిపారు. జిల్లా మహిళల జట్టు శనివారం నెల్లూరు జిల్లా జట్టుపై 11-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. జట్టులో నసీమా మూడు గోల్స్, నవ్యశ్రీ మూడు గోల్స్, మాధురి బాయి రెండు గోల్స్, పవిత్ర, వైష్ణవి, వర్ష ఒక్కొక్క గోల్ చేసి రెండో విజయాన్ని నమోదు చేశారు. మధ్యాహ్నం మూడో లీగ్ మ్యాచ్‌లో తిరుపతి జట్టుతో 3-1 గోల్స్ తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నారు. ఆదివారం జరిగే సెమీ ఫైనల్స్‌లో అనంతపురం జిల్లా జట్టుతో తలపడనుంది. క్రీడాకారుల వెంట మేనేజర్ అరవింద్‌గౌడ్, కోచ్ మారుతికుమార్ ఉన్నారు.

రైళ్లలో పోలీసుల తనిఖీలు



రైలులో తనిఖీ చేస్తున్న పోలీసులు

హిందూపురం: రైల్వే, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. హిందూపురం రైల్వేస్టేషన్ గుండా వచ్చివెళ్లే రైళ్లలోని ప్రయాణికుల లగేజీని తనిఖీ చేశారు. అలాగే ప్లాట్‌ఫారంలో అనుమానాస్పదంగా ఉన్న వారిని విచారించారు. పార్శిల్ కార్యాలయంలోని వస్తువులనూ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గంజాయి, తదితర వాటిని నియంత్రించేందుకే తనిఖీలు చేపట్టినట్లు రైల్వే ఎస్‌ఐ సజ్జప్ప తెలిపారు.



ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు

• అల్లాహు అక్బర్

జిల్లా వ్యాప్తంగా శనివారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాలకు చేరుకుని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ప్రతి ముస్లిం తన స్తోమతకు తగ్గట్టు ఆర్థిక సాయం చేశారు. ప్రజాప్రతినిధులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



హిందూపురం ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

కూలి లేదు.. వేతనం అందదు

ముదిగుబ్బ మండలం చిన్నకోట్లకు చెందిన వెంకటరమణ కుటుంబం ఉపాధి హామీ పథకం ద్వారానే జీవనం సాగిస్తోంది. కూలి డబ్బుతోనే పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించుకుంటున్నారు. ఈ నెల 12న బడి తలుపులు తెరుచుకోనున్నాయి. అయితే వీరికి ఏప్రిల్ నుంచి ఉపాధి కూలి డబ్బులు చెల్లించక పోవడంతో పూట గడవడమే కష్టంగా మారింది. ఇక పిల్లల చదువు ఎట్లా..? అని ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది.

..జిల్లా వ్యాప్తంగా 4 లక్షల మంది ఉపాధి కూలీల పరిస్థితి ఇదే. మూడు నెలల కూలి డబ్బులు బకాయిగా ఉండటంతో అప్పులు చేసి పూట గడుపుకుంటున్నారు. చాలా మంది బెంగళూరుకు వలస వెళ్లి 'ఉపాధి' పొందుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- జిల్లాలో 'ఉపాధి' దుస్థితి
- 3 నెలలుగా కూలీలకు అందని వేతనాలు
- రూ.58.80 కోట్ల కూలి డబ్బులు బకాయి
- ఒక్కో కూలీకి సగటున రూ.20 వేలు పెండింగ్
- ఉపాధి సిబ్బందికీ 3 నెలలుగా మంజూరుకాని జీతాలు

కదిరి: వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గాడి తప్పింది. గతంలో నిరుపేదలకు ఆదరవుగా ఉన్న ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంరాగానే అస్తవ్యస్తంగా మారింది. చేసిన పనులకు 3 నెలలుగా వేతనాలు అందక ఉపాధి కూలీలు పస్తులతో అలమటిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారం రోజుల్లో ఉపాధి కూలి డబ్బులు చెల్లించాలి. గరిష్టంగా 15 రోజుల్లోపే వారి పనికి సంబంధించిన మొత్తం నేరుగా ఖాతాలో జమ చేయాల్సి ఉన్నా..ఈ నిబంధనలేవీ అమలు కావడం లేదు. మరోవైపు ఉపాధి హామీ సిబ్బందికీ వేతనాలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకుపోయిన బకాయి

జిల్లాలోని 2,59,895 కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్ కార్డులుండగా... 4,76,217 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రసుత్తం 2.13 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉండగా..3.90 లక్షల మంది క్రమం తప్పకుండా ఉపాధి కూలి పనులకు వెళ్తున్నారు. వీరికి 3 నెలలుగా కూలి డబ్బులు అందడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి ఇప్పటి దాకా రూ.58.80 కోట్ల కూలి డబ్బులు బకాయి ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మెటీరియల్ కేటగిరీలో గ్రామాల్లో సిమెంటు రోడ్లు తదితర పనులు చేసిన వారికి కూడా బకాయిలు పేరుకుపోయాయి. మరోవైపు ఉపాధి హామీ పథకం కార్యక్రమాల పర్యవేక్షణకు మండల కంప్యూటర్ సెంటర్(ఎంసీసీ)లో పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్లతో పాటు నిత్యం కూలీలతో పాటు ఉంటూ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా 3 నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో వీరి పరిస్థితి కూడా దయనీయంగా మారింది.

మితిమీరిన రాజకీయ జోక్యం

గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ అమలులో అధికార పార్టీ నేతల జోక్యం మితిమీరింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఏకపక్షంగా తొలగించారు. వారి స్థానంలో కూటమి పార్టీల సానుభూతి పరులను నియమించారు. గ్రామాల్లో పేదలకు పనులు అప్పగించే విషయంలోనూ పార్టీలు చూస్తున్నారు. అధికార పార్టీకి సహకరించిన వారికి మాత్రమే పనులు అప్పగించాలని అధికారులపై ఒత్తిళ్లు ఉన్నాయనే విమర్శలున్నాయి. దీంతో చాలా మంది స్థానికంగా పనులు దొరక్క..దొరికినా కూలీలు సకాలంలో అందక... గ్రామాలు విడిచి బెంగళూరుకు వలస వెళ్లారు. అక్కడ భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

2,59,895
జిల్లాలోని జాబ్ కార్డులు

4,76,217
ఉపాధి కూలీల సంఖ్య

రూ. 58.80 కోట్లు
కూలీలకు బకాయిగా ఉన్న మొత్తం

బిల్లులు రావడం లేదు



రోజంతా కష్టపడితే రూ.250 కూలి వస్తుంది. ఆ డబ్బులు కూడా 3 నెలల నుంచి ఇవ్వడం లేదు. ఆ డబ్బుతోనే పూట గడిచేది. అవి కూడా ఇవ్వకపోతే ఎలా? నెలల తరబడి డబ్బులివ్వకపోతే మేం ఏం తినాలి..ఎట్లా బతకాలి?. అదిగో.. ఇదిగో అనడమే గానీ.. ఇంత వరకూ డబ్బులు జమ చేసింది లేదు. –శంకరమ్మ, బయగారిపల్లి, తలుపుల మండలం

అప్పు చేసి పూట గడుపుకుంటున్నాం



ఎండలు మండుతున్నా కరువు పనులకు వెళ్తున్నాం. ఇంతకు ముందు వారానికి ఒకసారి మస్టర్లు చూసి కూలి డబ్బులు ఇచ్చే వాళ్లు. ఇప్పుడు మూడు నెలలు అవుతున్నా.. అతీగతీ లేదు. ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తున్నాం. ఉపాధి డబ్బులొస్తాయన్న ధైర్యంతో అప్పుచేసి పూట గడుపుకుంటున్నాం. –జి.రామన్న, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

పెండింగ్ వాస్తవమే



ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ 15 నుంచి ఇప్పటి దాకా కూలి డబ్బులు చెల్లించాల్సిన మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా రూ.58.80 కోట్ల కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయి. ప్రియారిటీ ప్రకారం వారం రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. –కె.విజయ ప్రసాద్, పీడీ, డ్వామా

దళిత ఎమ్మెల్యేల నోరు మూగబోయిందా?

- సభ్యసమాజం సిగ్గుపడేలా దళిత మైనర్ బాలికపై అత్యాచారం
- ఇంత జరిగినా దళిత ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోవడం అన్యాయం
- ఎస్పీ గారూ.. నిష్పక్షపాతంగా విచారించండి
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'రామగిరి మండలంలోని గ్రామంలో దళిత మైనర్ బాలికపై అత్యాచార ఘటనలో వాస్తవాలు వెలుగులోకి వస్తోంటే ఇది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతున్న రాష్ట్రమా... లేక రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న దుర్మార్గపు ప్రపంచమా అనేది తెలియడం లేదు. ఇంత జరుగుతున్నా జిల్లాలోని దళిత ఎమ్మెల్యేలు, నాయకులు ఎందుకు మాట్లాడడం లేదో అర్థం కావడం లేదు. వారి నోరు మూగబోయిందా.. మాట గొంతుదాటి బయటకు రావడం లేదా' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగిరి మండలం పరిటాల కుటుంబం కబంధహస్తాల్లో ఉందన్నారు. బాలికపై అఘాయిత్యం జరిగిన రామగిరి మండలంలోని గ్రామం పరిటాల పెత్తనంతో 40 ఏళ్లుగా ప్రజాస్వామ్యం చూడలేదన్నారు. 'అక్కడ పరిటాల వారు చెప్పిందే వేదం. చేసిందే శాసనం. అదే చట్టం' అన్నారు. అక్కడ పరిటాల రాజ్యాంగం అమలవుతోందన్నారు. ఆ గ్రామంలో సూడో నక్సలైట్లు, కిరాయి హత్యలు చేసేవారు, రౌడీషీటర్లంతా పరిటాల సైన్యమన్నారు. ఇలాంటి గ్రామంలో ఒక దుర్మార్గుడు మైనర్ బాలికను బెదిరించి లొంగదీసుకుని వీడియో తీసి... ఆ వీడియోను బయటకు పెడతానంటూ బెదిరించి బలత్కారం చేశాడన్నారు. తర్వాత బ్లాక్‌మెయిల్ చేసి 14 మంది ఆ బాలికపై అత్యాచారం చేశారన్నారు. చివరకు వీడియో తీసిన వాడి తండ్రి కూడా బాలికపై కన్నేసి బలాత్కరించాడని తెలిపారు. ఏడాదికాలంగా ఆ అమ్మాయిని చిత్రవధకు గురి చేశారన్నారు. ఆ బాలిక గర్భం దాల్చిన ఆర్నెల్ల తర్వాత ఆనోట, ఈనోట పడి 'సాక్షి' మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిసిందన్నారు. వాస్తవాలు వెలుగులోకి వస్తుంటే సభ్యసమాజం సిగ్గుపడే విధంగా ఉందన్నారు. ఒక మహిళ ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గం, ఒక మహిళ ఎస్పీగా ఉన్న జిల్లాలో మైనర్ బాలికపై అత్యంత దారుణంగా నెలల తరబడి అత్యాచారం జరిగితే ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చీమ చిటుక్కుమన్నా పరిటాల కుటుంబానికి సమాచారం చేరవేసే గ్రామస్తులు ఇంతటి దారుణ ఘటన గురించి చెప్పకుండా ఉంటారా అనే అనుమానం వ్యక్తం చేశారు. కీచకుల మెడల్లో చెప్పుల హారాలు వేయించి ఊరేగించేలా చూడాలని కోరారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌కు ఈ ఘటన తెలియకుండా ఉంటుందా అని ప్రశ్నించారు. మరి ఇన్ని రోజులు ఎందుకు బయటపెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, పెన్నోబులేసు, ఆలమూరు ఓబులేసు, మీనుగ నాగరాజు, సాకే వెంకటేష్, విశ్వనాథరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అప్పులోళ్ల అమానుషం

- అప్పు చెల్లించాలని ఇంటికి తాళాలు
- ఆరుబయటే బాధితులు



ఇంటికి తాళం వేయడంతో బయట కూర్చున్న గంగమ్మ, పిల్లలు

హిందూపురం: అప్పు కట్టాలంటూ ఇంటికి తాళం వేశారు. కుటుంబ సభ్యులను బయటకు గెంటేశారు. అప్పు తిరిగి చెల్లించే దాకా ఇంటి తాళం ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. ఈ అమానుష ఘటన హిందూపురం మండలం గోళాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు... గ్రామానికి చెందిన గంగమ్మ భర్త అనారోగ్యంతో ఐదేళ్ల కిందట మృతిచెందాడు. అప్పటి నుంచి కూలి పనులకు వెళుతూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటోంది. అయితే..నీ భర్త తమతో అప్పు తీసుకున్నాడని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని బంధువులు గంగమ్మపై ఒత్తిడి తెస్తూ వస్తున్నారు. ముఖ్యంగా అంజక్క కుమారుడు సుధాకర్ వేళాపాళా లేకుండా ఇంటి వద్దకు వచ్చి బెదిరిస్తున్నాడు. దీంతో ఆమె గతంలో హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్పట్లో మందలించడంతో సుధాకర్ కొన్ని రోజులు మిన్నకుండిపోయాడు. మళ్లీ ఇప్పుడు వేధించడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలోనే శనివారం గంగమ్మ ఇంటికి తాళం వేశాడు. అప్పు తిరిగి చెల్లించే వరకు తాళం ఇచ్చేది లేదని తెగేసి చెప్పాడు. దీంతో గంగమ్మ, పిల్లలు నిస్సహాయస్థితిలో చాలాసేపు ఇంటి బయటే కూర్చుండిపోయారు. తన భర్తకు అప్పు ఇచ్చినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని, అయినా ఇబ్బంది పెడుతున్నారని గంగమ్మ వాపోయారు. చివరకు అధికారులకు, పోలీసులకు విషయం తెలియడంతో సుధాకర్‌ను మందలించి తాళం చెవి ఇప్పించారు.

రైతులపై రాజకీయ కక్ష

- వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై జనసేన నాయకుడి దుర్మార్గపు చర్య
- విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి
- పంటలు ఎండిపోతున్నాయని బాధిత రైతుల ఆవేదన



ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి కనెక్షన్ ఇవ్వకుండా వెళ్లిపోయిన విద్యుత్ అధికారులు



విద్యుత్ సౌకర్యం లేక, సాగునీరు అందక ఎండిపోతున్న చీనీచెట్లు

ధర్మవరం: కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి సామాన్యులపై టీడీపీతో పాటు జనసేన నేతల వేధింపులూ అధికమయ్యాయి. అధికారం అండతో రైతులపైనా కక్ష సాధిస్తున్నారు. తాజాగా ధర్మవరంలో జనసేన నేత చిలకం మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు రైతులను టార్గెట్ చేసి ఆర్థికంగా దెబ్బతీసేందుకు కుట్ర చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం మండల పరిధిలోని ముచ్చురామి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌రెడ్డి, రవికుమార్ చీనీతోటలు సాగుచేస్తున్నారు. లోఓల్టేజీ సమస్య ఏర్పడి సాగునీరు అందక పోవడంతో 2023 జూన్‌లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం విశ్వనాథ్‌రెడ్డి రూ.38 వేలు, రవికుమార్ రూ.12,400 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారు. వారం రోజుల క్రితం విద్యుత్ కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభాలు నాటి లైన్ లాగుతుండగా... ధర్మవరం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి విద్యుత్ అధికారులకు ఫోన్ చేశారు. వారిద్దరూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనీ, వారికి కొత్త కనెక్షన్ ఇవ్వకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పనులు చేస్తున్న వారు ఉన్నఫలంగా వెనుతిరిగారు. ఎందుకని బాధిత రైతులు ప్రశ్నిస్తే... ఒకసారి జనసేన ఇన్‌చార్జ్‌ను కలవమని అధికారులు చెప్పారు. వారం రోజులుగా విద్యుత్ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం లేకపోవడంతో... ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కేవలం తాము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే కారణంతో జనసేన ఇన్‌చార్జ్ తమ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగించకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. సాగునీరందక చీనీతోట ఎండిపోతున్నా... అధికారులు కూడా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గడం అన్యాయమని వాపోతున్నారు.

క్లుప్తంగా

అలకబూని.. ఇంటినుంచి వెళ్లిపోయిన విద్యార్థి

- పట్టుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



విద్యార్థిని తండ్రికి అప్పగిస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: ఎంసెట్ మార్కుల విషయంలో తల్లిదండ్రులు మందలించారని ఓ విద్యార్థి అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అతడిని వెతికి పట్టుకొచ్చి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన నారాయణ స్వామి కుమారుడు రాజు ఇటీవల ఎంసెట్ రాశాడు. పరీక్ష కీ ఆధారంగా 35 మార్కులు వచ్చాయి. సరిగా చదవలేదంటూ తల్లిదండ్రులు మందలించడంతో అలిగిన రాజు శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తెలిసిన చోట్లల్లా వెదికినా ఎక్కడా కనపడలేదు. శనివారం ఉదయం టూటౌన్ సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేశారు. ఆయన తన సిబ్బందితో గాలింపు చేపట్టి విద్యార్థి తన స్నేహితుడు ఇంటిలో ఉన్నాడని తెలుసుకుని, పట్టుకొచ్చి తండ్రి నారాయణస్వామికి విద్యార్థిని అప్పగించారు.

ఘర్షణలో యువకుడి మృతి



మృతి చెందిన యశ్వంత్

గార్లదిన్నె: ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. పోలీసులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచెర్ల గ్రామానికి చెందిన దివాకర్, యశ్వంత్ శనివారం ఘర్షణ పడ్డారు. కోపోద్రిక్తుడైన దివాకర్ కట్టెతో దాడి చేయడంతో యశ్వంత్ (18) స్పృహతప్పి పడిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని యశ్వంత్‌ను అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి యశ్వంత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘర్షణకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

30 పడకల ఆస్పత్రి

మండల కేంద్రం ముదిగుబ్బలో 30 పడకల ఆస్పత్రి కలగా మారింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో తనను గెలిపిస్తే సత్య కుమార్ యాదవ్ 30 పడకల ఆస్పత్రిగా మారుస్తానని, ముదిగుబ్బకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన గెలిచి.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది అవుతోంది. అయినా ఏ ఒక్క హామీనీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు.

- ముదిగుబ్బలో మెరుగైన వైద్యం మిథ్యే
- 80 వేల జనాభాకు ఆరు పడకల ఆస్పత్రే దిక్కు
- అప్‌గ్రేడ్ చేస్తామన్న మంత్రి సత్యకుమార్ హామీ ఏడాది గడిచినా అమలుకు నోచుకోని వైనం



ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముదిగుబ్బ: రాష్ట్రంలోనే అతి పెద్ద మండలం ముదిగుబ్బ. 1964లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేశారు. ఆరు పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రస్తుత మండల జనాభా 80వేల దాకా ఉంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా పని చేసిన కామినేని శ్రీనివాసరావు ముదిగుబ్బ పీహెచ్‌సీని సందర్శించినపుడు 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అయినా 30 పడకల సామర్థ్యం గల ఆస్పత్రిగా తీర్చిదిద్దుతారేమోనని ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. గతంలో నలుగురు డాక్టర్లు ఉండేవారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఇద్దరిలో ఒకరు 104 వైద్య సేవలకు వెళ్లాల్సి ఉంటుంది. స్టాఫ్‌నర్స్‌లు పేరుకు ముగ్గురు ఉన్నప్పటికీ.. డిప్యూటేషన్‌పై వేరే చోట పనిచేస్తున్నారు. రోజూ 300 మంది ఓపీ సేవల కోసం వస్తుంటారు. అందుబాటులో ఒక డాక్టరే ఉండడం వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించలేకపోతున్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. ప్రస్తుతం నైపుణ్యత కలిగిన డాక్టర్లు లేకపోవడంతో ఆపరేషన్లు చేయడం లేదు. దీంతో ఎవరైనా ఆపరేషన్లు చేయించుకోవాలనే వారు అటు కదిరి గానీ ఇటు అనంతపురం గానీ వెళ్తున్నారు.

రోడ్డు ప్రమాద కేసులు ఎక్కువే..

205 జాతీయ రహదారి ముదిగుబ్బ మీదుగా పోవడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ మెరుగైన వైద్య సేవలు లేక ప్రమాదాలు జరిగిన వారికి ప్రథమ చికిత్స చేసిన వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి గానీ అనంతపురం ఆస్పత్రికి గానీ రెఫర్ చేస్తుంటారు. కొన్ని సమయాల్లో అక్కడికి చేరుకునే లోపే ప్రాణాలు కోల్పోయిన వారు చాలామంది ఉన్నారు. దీంతో పాటు మలకవేమల క్రాస్‌లో మరొక పీహెచ్‌సీ కూడా ఉంది. అయితే ఆ పీహెచ్‌సీలో 5 సచివాలయాల పరిధిలోని వారికి మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. మిగిలిన 17 సచివాలయాలు ముదిగుబ్బ పీహెచ్‌సీ పరిధి కిందే ఉన్నాయి. మండల వ్యాప్తంగా 13 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండగా.. అందులో కొడవండ్లపల్లి, మల్లేపల్లి, సంకేపల్లి ఉప కేంద్రాలలో సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

30 పడకల ఆసుపత్రి వస్తే

ముదిగుబ్బలో 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తే ఐదారుగురు వైద్యులు వస్తారు. దంత, కంటి, గైనకాలజీ తదితర విభాగాల సేవలు అందుబాటులోకి వస్తాయి. తగినన్ని మందులు నిల్వ ఉంచుతారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ఇక్కడే చికిత్స చేయవచ్చు. తక్షణమే వైద్యం చేస్తే ప్రాణాలు పోయే అవకాశం ఉండదు.

కల సాకారమయ్యేనా..?



ముదిగుబ్బలో 30 పడకల ఆస్పత్రి చాలా అవసరం. రాష్ట్రంలో అతి పెద్ద మండలంగా పేరున్న ముదిగుబ్బలో అందుకు తగినట్టుగా ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఇప్పటికి ఏడాది అయ్యింది. హామీ మేరకు ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి.. మెరుగైన వైద్య సేవలందిస్తే బాగుంటుంది.

– మల్లికార్జున, ఎంపీటీసీ, ముదిగుబ్బ

వైద్య సేవలు మెరుగుపడాలి



ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉన్నారు. ఒకరు 104 వాహనానికి వెళ్తున్నారు. ఉన్న ఒక్క డాక్టర్‌తో పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. పీహెచ్‌సీలో మందుల కొరత కూడా ఉంది. తగినంతమంది డాక్టర్లను అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్య సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మీ సేవ చంద్ర, ముదిగుబ్బ

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- రెండు వాహనాలు ధ్వంసం..
- 8 మందికి గాయాలు



గాయపడిన రంగ

పుట్టపర్తి టౌన్: స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ శనివారం కొత్తచెరువులో కలకలం రేపింది. పోలీసు స్టేషన్ ఎదుటే బాహాబాహీకి దిగగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే... కొత్తచెరువుకు చెందిన దాల్‌మిల్ సూరి భార్య మహలక్ష్మి కొత్తచెరువులోని తన 7.5 సెంట్ల భూమిని రిజిస్టర్ ఆయకం పెట్టి బుక్కరాయసముద్రానికి చెందిన సూర్యనారాయణరెడ్డి భార్య సుశీలమ్మతో ఐదేళ్ల క్రితం రూ. 50 లక్షలు అప్పుగా తీసుకుంది. క్రమం తప్పకుండా వడ్డీతో పాటు అసలు కొంత చెల్లిస్తూ ఇప్పటికే రూ.40 లక్షలు దాకా చెల్లించారు. మిగతా మొత్తం చెల్లిస్తామని తమ భూమిని తిరిగి తమకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని మహలక్ష్మి కోరింది. అయితే రుణదాత సుశీలమ్మ భూమిని రిజిస్టర్ చేయించకుండా కాలయాపన చేసింది. దీంతో మహలక్ష్మి కోర్టును ఆశ్రయించగా... ఈ కేసు పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ శనివారం సుశీలమ్మ కుమారుడు సాగర్‌రెడ్డి రెండు వాహనాలలో కిరాయి గుండాలను తీసుకుని వచ్చి కొత్తచెరువులోని స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న మహలక్ష్మి వర్గీయులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మాటామాట పెరగడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రెండు వాహనాలు ధ్వంసం కాగా... 8 మందికి గాయాలయ్యాయి. అనంతరం ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసేందుకు కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్ ముందు మరోసారి ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో పోలీసులు అందరికీ సర్దిచెప్పారు. అనంతరం ఇరువర్గాల నుంచి ఫిర్యాదు తీసుకుని క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



స్థలం వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

కట్నం కోసం వేధింపులు

యాడికి: అదనపు కట్నం కోసం భర్త, మామ వేధిస్తున్నారని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. చందన గ్రామానికి చెందిన దళవాయి ఐశ్వర్యకు నార్పల మండలం కేశేపల్లికి చెందిన కుళ్లాయప్ప కుమారుడు విష్ణువర్ధన్‌తో ఏడాది కిందట ప్రేమ వివాహమైంది. అయితే గత కొంతకాలంగా భర్తతో పాటు మామ కట్నం తేవాలని వేధిస్తుండటంతో భరించలేకపోయిన ఐశ్వర్య పుట్టింటికి వచ్చేసింది. బంధువుల ద్వారా పంచాయితీ చేసినా సమస్య పరిష్కారం కాకపోవడం, వేధింపులు మళ్లీ పెరగడంతో ఐశ్వర్య శనివారం యాడికి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాలికపై అత్యాచారం అమానుషం



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ అన్నారు. శనివారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఘటనకు కారణమైన వారు ఏ పార్టీకి చెందినవారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. పేదరికాన్ని, సామాజిక వెనుకబాటును అవకాశంగా తీసుకుని దళిత బాలికపై ఆరు నెలలుగా 14 మంది అత్యాచారానికి పాల్పడడం సభ్య సమాజానికే సిగ్గుచేటన్నారు. నిస్సహాయ బాధిత బాలికకు అండగా నిలవాల్సిన సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు విమర్శలు చేసుకోవడం నిందితులకే తోడ్పుతుందనే విషయం గుర్తించాలన్నారు. ఈ దుర్మార్గ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఎద్దుల బండిని ఢీకొన్న ఐచర్ వాహనం

- రైతుకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వీరనారప్ప

బత్తలపల్లి: వేల్పుమడుగు క్రాస్ సమీపంలో ఎద్దులబండిని ఐషర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే ఘటనలో రెండు ఎద్దులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన రైతు వీరనారప్ప శనివారం తెల్లవారుజామున వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దుల బండితో బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామానికి బయల్దేరాడు. వేల్పుమడుగు క్రాస్ సమీపంలోకి రాగానే ధర్మవరం నుంచి బత్తలపల్లి వైపు వేగంగా వస్తున్న ఐచర్ వాహనం ఎద్దుల బండిని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో రైతు వీరనారప్ప ఎద్దుల బండిలో నుంచి ఎగిరి అల్లంత దూరంలో పడిపోవడంతో నడుములు విరిగాయి. ఎద్దులు సైతం గాయపడ్డాయి. ఎద్దుల బండి ధ్వంసమైంది. ఇటుకల బట్టీ వద్దనున్న కూలీలు అప్రమత్తమై వాహనాన్ని కొంత దూరం వెంబడించినట్లు తెలిసింది. అయితే వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. రైతును బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దర్శన టికెట్లపై అర్చకుల అభ్యంతరం



ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అర్చకులు

గుత్తి: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి దర్శనానికి టికెట్ల విధానాన్ని ప్రవేశపెట్టడంపై అర్చకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాలయం వద్ద శనివారం అర్చకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, భక్తులు అధికంగా దైవ దర్శనానికి వస్తారన్నారు. కరువుకు నిలయమైన ఇలాంటి ప్రాంతంలో దైవ దర్శనానికి టికెట్ల విధానం అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదీగాక అధికారులు ఏకపక్షంగా టికెట్ల విధానం అమలు చేయడానికి సిద్ధమయ్యారన్నారు. కనీసం అర్చకులు, గ్రామ పెద్దలను కూడా సంప్రదించలేదన్నారు. వెంటనే టికెట్ల విధానం యోచనను విరమించుకోవాలన్నారు.

పోస్టులున్నా.. ఆసక్తి సున్నా

- పదోన్నతులు తీసుకునేందుకు ఆసక్తి చూపని ఎస్జీటీలు
- 44 'సోషల్' పోస్టులకు నలుగురే ఆసక్తి
- పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల్లోనూ అదే తీరు



కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు పదోన్నతులు తీసుకునేందుకు ఎస్జీటీలు ఆసక్తి చూపలేదు. వాస్తవానికి ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచినా...చాలా సబ్జెక్టులకు ఒక్కరూ కూడా హాజరుకాకపోవడం విశేషం. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయి శుక్రవారం సాయంత్రం మొదలైన పదోన్నతుల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 10 గంటల వరకు సాగింది. ఇందులో జిల్లా పరిషత్ పాఠశాలలకు సంబంధించిన సోషల్ సబ్జెక్టులో 44 ఖాళీలుంటే కేవలం నలుగురు మాత్రమే పదోన్నతి తీసుకున్నారు. అలాగే పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు సంబంధించి కూడా 45 ఉంటే కేవలం ఐదుగురు మాత్రమే విల్లింగ్ ఇచ్చారు. చాలా పోస్టులు మిగిలిపోవడంతో ఆర్జేడీ శామ్యూల్ రాష్ట్ర అధికారులతో మాట్లాడి స్పష్టత తీసుకున్నారు. ఆసక్తి ఉంటే వీరితర్వాత వారిని కూడా పిలిచేలా అనుమతులు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయా సబ్జెక్టులకు అర్హులైన ఎస్జీటీలకు ఎంఈఓల ద్వారా సమాచారం అందించి సాయంత్రం 4 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ఈ క్రమంలో సాయంత్రం 5.30 గంటలకు ఆ రెండు కేడర్ పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా...సోషల్‌లో ఎస్సీ కోటాలో కొన్ని తప్ప తక్కిన అన్ని పోస్టులు భర్తీ అయ్యాయి. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు రాత్రి 11 గంటల సమయానికి 16 మంది (ఇందులో ఉదయమే 5 గురు తీసుకున్నారు) ఆప్ట్ చేశారు.

బదిలీ అయిన ఎస్ఏల వివరాలు లేవట

స్కూల్ అసిస్టెంట్ల కేడర్‌కు సంబంధించి అన్ని సబ్జెక్టుల్లోనూ తప్పనిసరి, రిక్వెస్ట్ బదిలీలు పూర్తయ్యాయి. ఉత్తర్వులు కూడా జనరేట్ అయ్యాయి. ఇవన్నీ శుక్రవారం తెల్లవారుజామునే పూర్తయ్యాయి. అయితే జిల్లాలో ఏ సబ్జెక్టులో ఎంతమంది బదిలీ అయ్యారనే సమాచారం శనివారం రాత్రి వరకు విద్యాశాఖ అధికారులు చెప్పకపోవడం విశేషం. ఈ వివరాలు ఇంకా తమకు రాలేదంటూ డీఈఓ చెప్పారు. కాగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లందరూ శనివారం రిలీవ్ అయి ఆదివారం కొత్తస్థానాల్లో చేరాలనే ఆదేశాల్లో మార్పు చేశారు. పాతస్థానాల్లో ఆదివారం (నేడు) రిలీవ్ అయి సోమవారం కొత్త స్కూళ్లల్లో చేరాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లు

ఎస్జీ టీచర్ల బదిలీలకు ఆదివారం వెబ్ ఆప్షన్లు పెట్టుకోనున్నారు. మ్యాన్యువల్‌గా కాకుండా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎంఈఓల కార్యాలయాల్లో 10 కంప్యూటర్లు సిద్ధంగా ఉంచుకోవాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆయా మండలాల పరిధిలోని టీచర్లందరికీ అక్కడే వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సదుపాయాలు కల్పించనున్నారు. ఎంఈఓ కార్యాలయాల్లో సరైన వసతి లేకపోతే సమీపంలోని స్కూల్‌లో ఏర్పాటు చేసుకోవాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలో ఎంఈఓలందరూ అప్రమత్తమయ్యారు. మరోవైపు ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ వెబ్ ద్వారా కాకుండా మ్యానువల్‌గా నిర్వహించాలంటూ ఆదివారం ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది.

నెత్తురోడిన రహదారి

- బొలెరోను ఢీకొన్న లారీ
- మహిళా కూలీ దుర్మరణం
- మరో 16 మందికి గాయాలు
- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం



మృతి చెందిన మంగమ్మ





అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో జాతీయరహదారి నెత్తురోడింది. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని లారీ వెనుకనుంచి ఢీకొంది. ఈ ఘటనలో మహిళా కూలీ దుర్మరణం చెందింది. మరో 16 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదస్థలిలో రోడ్డుపై ఎగిరిపడ్డ కూలీలు రక్తగాయాలతో ఆర్తనాదాలు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఎగువపల్లి, కొండకింద కొట్టాల, కల్లూరుకు చెందిన దాదాపు 35 మంది కూలీలు చీనీకాయలు తొలగించే పనికి శనివారం ఉదయం కల్లూరు నుంచి బొలెరో వాహనంలో ఆత్మకూరు మండలం సిద్దరాంపురం వెళ్లారు. సాయంత్రం పని ముగించుకొని కూలీలందరూ తిరిగి బొలెరో వాహనంలో కల్లూరుకు బయల్దేరారు. తిమ్మంపేట సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి వచ్చేసరికి రాత్రి అయ్యింది. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ.. బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న కొండకింద కొట్టాలకు చెందిన మహిళా కూలీ మంగమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో 16 మంది కూలీలు ఎగిరి రోడ్డుపై పడ్డారు. రక్షించండంటూ ఆర్తనాదాలు చేస్తుండడంతో స్థానికులు గమనించి 108,పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, 108 సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకుని గాయపడిన ఎగువపల్లికి చెందిన నాగలక్ష్మి, పద్మావతి, శివమ్మ, లక్ష్మీదేవి, యశ్వంత్, పార్వతమ్మ, దేవమ్మ, ఇందిర, లక్ష్మమ్మ, గుడ్డాలపల్లికి చెందిన ఈరమ్మ, కల్లూరుకు చెందిన వరలక్ష్మి, సావిత్రి, రామలక్ష్మి, భార్గవి, భావన, సావిత్రమ్మని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో నాగలక్ష్మి, ఈరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కిక్కిరిసిన సర్వజనాస్పత్రి

అనంతపురం మెడికల్ : తిమ్మంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులతో సర్వజనాస్పత్రి కిక్కిరిసింది. క్షతగాత్రుల ఆర్తనాదాలు ఎమర్జెన్సీ వార్డులో పెద్దఎత్తున వినిపించాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సంబంధిత వైద్యులను ఆదేశించారు.



ప్రమాదానికి కారణమైన లారీ



గాయపడిన మహిళా కూలీలు



బాధితురాలికి చికిత్స అందిస్తున్న దృశ్యం